# సుడిగాలి

రచయిత్రి:
శ్రీమతి పి. జి. శశి.

సాయంత్రము!

డభాపై నిలుచున్నాను. ప్రభాకరుడు ప్రకృతిని తన గులాబివర్ణచ్ఛాయాకిరణాలతో కావలించుకొంటున్నాడు. చుట్టు కొండలు మనోజ్ఞమయిన రంగులో మనోహరంగ కనిపిస్తున్నాయి. చల్లనిగాలి మెత్తగా వీస్తూ శరీరాన్ని జలదరింప జేస్తూంది. దూరానకొండలు, కొండల మధ్యలో వాగులు, వాగుల కిరువైపుల పచ్చని వృక్షజాలాలు.

ఇంతటి మనోహరమయిన ప్రకృతి సమ్ముఖంలో వున్నా! యెందుకో మరి నా గుండెలో వేదనాభరితములయిన భావాలు...వర్షాకాలంలో గోదావరీ కెరటాల్లాగా కొట్టుకులాడుతున్నాయి. చల్లగా గాలి వీస్తూ శరీరాన్ని జలదరింప జేస్తున్నా. నాలోనుండి బాధాపూరితమయిన వేడి నిట్టూర్పులు వెలువడుతున్నాయి... ఎందుకు?...కారణం?...

ఏమిటావైపు!? ఎంతటి భీకరమయిన సుడిగాలి! ఇటువైపే వస్తున్నది! అంతటి భీకరమయిన సుడిగాలిలో గూఢ యెంతటి సౌందర్యమున్నది:—అలానే దానివైపె చూస్తూ నిల్చుచున్నాను. నాలోని ఆలోచనలు రంగులు మార్చుకొంటున్నాయి.

వాడి రాలిపోయిన ఆకులు!

కాలి మసియైపోయిన కట్టెల బూడిద!

శక్తి లేని సూక్ష్మజీవులు!

ఇంకా యెన్నో ఆ సుడిగాలిలో వృత్తాలు చుట్టుతూ గిలగిలలాడుతూ ఆకాశంలోకి యెగిరిపోతున్నాయి.

నాకనిపించింది...'ఏనాటికో ఒకనాడు నేనూ... వాటిలా...వాడి—' కాలి అటువంటి సుడిగాలిలోకలసి ఆకాశంలోకి యెగిరిపోతానేమోనని.

అవును. ప్రతి జీవి అంతే. ఈ సంఘమనే నిబంధనల సుడిగాలిలో ప్రతి జీవి శక్తిలేని సూక్ష్మజీవుల్లా ఎగిరిపోవలసిందే!

అబ్బ! యెంతటి భయంకరమయిన సత్యానికి ఈ సుడిగాలి లక్ష్యంగా నిలుస్తున్నది.

అయితే నేనూ! నా లలితగూడ అంతేనా! ఇరువురం ఈ సంఘపు నిబంధనలలో వాడిపాడియై పోవలసిందేనా! అంతేనా! ఇక గత్యంతరంలేదా!... లేదా!

ఏమిటీ భయంకర ఆలోచనలు. ఎందుకిలా సతమతమయిపోతున్నాను...భగవాన్! నన్నెందుకిలా తయారుజేస్తావ్! ఇంతచేతగాని దద్దమ్మగా జీవించేందుకేనా ఈ పాడులోకంలో నన్ను పుట్టింపజేసినావు. వద్దయ్యా! నన్నొకమానవునిగా బ్రతుకనీ!... నా ప్రేమమయ లలితను నాదరిజేర్చు... నేనూ ఆనందాన్ని అనుభవించేటట్లు చేయి...—భగవాన్...—. భగవాన్!—...

'స్వామీ!—...స్వామీ!' ఎక్కడ నుండో...అంతరిక్షం నుండి పిలుపు.

నా హృదయం ద్రవించింది. నా కనులు వికశించినాయి.

భగవానుడు పలికినాడు...

'భగవాన్' ఉత్సాహంతో గట్టిగా పిలచాను.

'స్వామీ...' ప్రతి పిలుపు.

'భగవాన్! నాకోరిక తీర్చవచ్చావా! అయితే నా లలితను నా వద్దకు చేర్చు భగవాన్.' గట్టిగా అరిచాను.

'స్వామీ! నేను...లలితను...మీ లలితను...మీరు పిలచే ఆ భగవానుడంత దయార్ద్రహృదయుడు కాదు స్వామీ...'

యెక్కడనుండా మాటలు. లలిత మాటాడుతూంది. ఎక్కడ? ... 'లలితా ... నీవా' యెక్కడనుండి మాటాడుతున్నావ్! కనిపించవేలా! లలితా...! లలితా!

'స్వామీ! ఈవైపు...సుడిగాలి నన్ను ఆకాశంలోకి తీసుకెళ్తూంది. రా స్వామీ! మీలలితను మీరు కాపాడుకోండి...రండి'

అబ్బో! నా గుండెలు పగిలినంత పనయింది. చూచాను. నా లలిత సుడిగాలిలో వృత్తాలు చుట్టుతూ దీనంగ నా వైపే చూస్తూంది.

'అయ్యో! లలితా! నేచెప్పానే! నాదరి రమ్మని. ఈ ప్రకృతి దుష్టేష్టల్లో నలిగిపోతావు—. నీకెందుకా కష్ట

మని...రమ్మని...నా కౌగిలి సిద్ధంజేసి వుంచానే! నా మాట విన్నావా?'

'స్వామీ యెందుకలా మాటాడుతారు. జరిగిపోయిన సంఘటనలను జ్ఞాపకం చేసి నా గుండెలు నెందుకు బ్రద్దలు జేస్తారు. పోతున్నాను. ఇంకా దూరం తీసు కెళ్తుందీ గాలి. ఆదుకోండి—'

'వస్తున్నాను లలితా! నీ వెంబడే వస్తున్నాను. నా ప్రక్కగా దూసుకపోతున్న సుడిగాలి వెంబడి పరుగులు తీశాను.

పోతూంది...ఎక్కడెక్కడకో పోతూంది.

అడవి...

చీమలు దూరగూడని కారడవి.

నిలకోళ్ళజోంకృతులు.

వనమహిషంబులభాంకృతులు

మతగజముల కంఠీరవ కఠోరఘోషములు.

నాగుండెలో లలిత ఆర్తనాదాల ప్రతిధ్వానాలు...!

పరుగిడుతూనే వున్నాను 'లలితా...' అంటూ—

కాళ్ళు తేలిపోతున్నాయ్...

కళ్ళు మూతలుపడుతున్నాయ్...

ఒగర్చుకొంటూ ఆగాను.

కళ్ళు కదలించుకొని చూచాను...—.

లేదు, నా లలిత కనిపించలేదు.

మాయమయింది సుడిగాలి...!

నా లలితను కాపాడుకోలేకపోయాను నేను...—!

'అయ్యో! నాలలిత నాకు దూరమయిందే! నాకు దూరంగ, నాగుండెలో భీకరదావానలం రగిలించినిన్నా సుడిగాలి ఎక్కడో దూరదేశాలకు తీసుకెళ్ళిందే 'లలితా'...—'లలితా' అంటూ గట్టిగా అణచి మూసు కొన్న కళ్ళు తెఱచాను...

చీకటి

కాఱుచీకటి

ఇంతలో ప్రక్కన వెలుతురు...

కళ్ళు నులుముకొన్నాను.

అది అడవిగాదు; ఇల్లు!

గోడలు—గోడలకు వ్రేలాడుతున్న క్యాలండర్ల లోని చిత్రాలు నన్ను వెక్కిరిస్తున్నట్లు కనిపిస్తున్నాయ్!

ప్రక్కన నా మిత్రుడు. ఆశ్చర్యం వేసింది.

'ఇపుడు నేను పొందిన సంఘటన నిజం కాదా! ఆలోచనలు నా మెదల్లోపరవళ్ళు త్రొక్కుతున్నాయ్!'

'ఏమోయ్ నిదురలోగూడ ఆమె తలపేనా...ఇంత పిచ్చయితే యెలా!' అన్నాడు నిదురమత్తులో వున్న నా మిత్రుడు.

'లేదురా! భయంకరమయిన కలరా...' అంటూ... నిదురలో నేను పొందిన అనుభూతినంతా వివరించాను.

'అయితే భయపడవలసినంత ఏమీ లేదు! దుస్వప్నాలో సుఖపనానికి నాందిరా...నాయనా! యిక నిదురపో...' అంటూ తాను వెలిగించిన దీపాన్ని తగ్గించి పరుపులో ముడుకొన్నాడు నామిత్రుడు.

నేనేం జవాబివ్వలేదు. అలానే మౌనంగ వుండి పోయాను. నాలో సంఘర్షణపడుతూన్న ఆలోచనలె నన్ను మౌనంగ వుండేటట్లు జేశాయి.

నేనింతవరకు పొందింది కలా? కళనా?!

కళయని స్పష్టంగ తెలుస్తున్నా నాకెందుకో భయమేస్తూంది.

పరుపుపై వాలాను.

ఆ భయము...ఆలోచనలు మాత్రం నన్ను విడిచి పోకపోయాయి.

× × × ×

ఉదయమయింది. నా కార్యక్రమం మామూలుగానే సాగిపోతూంది. కానీ ఏం చేస్తున్నా, ఏం చేయదలచుకొన్నా రాత్రి కళ కనులముందు కదలి వన్ను భయకంపితుని చేస్తూంది.

నా లలితకేమయినా అపాయం వాటిల్లిందా?...ఇదే ప్రశ్న యిప్పటికెన్నో మార్లువేసుకొన్నాను. జవాబు శూన్యం.

నాకే పక్షుల్లా రెక్కలు వుంటే?

నాకే మృగంలా వేగం వుంటే—?

పరుపుతో వెళ్ళి నూరు మైళ్ళదూరంలో, వున్న నా లలితను కలుసుకొనేవాన్ని! కానీ నాకాశక్తిలేదు.

ఆ కళ నా మెదడులో మెదలినపుడెల్ల

నా లలిత నా కళ్ళ ముందు దీనమయినరూపంతో కదులుతూంది.

అలా కదలినపుడెల్ల నాకెందుకో ఏడుపొస్తుంది

'పోస్టు' అన్న కేకతో నా ఆలోచనలు ఆగి

యాయి. నా లలిత నుండి వచ్చిందేమోనని ఒక్క గెంతుతో పోస్టుమాన్ దగ్గరవాలి అతనిచేతిలోని ఉత్తరాన్ని లాక్కొన్నాను. ఆతురతగా చూచాను.

అవును. అది బళ్ళారి నుండే వచ్చింది. కానీ లలిత నుండి గాదు, ఆమె చెల్లెలు రామలక్ష్మినుండి. నిరుత్సాహమయింది. అయినా చదవాలిగదా!

'బావా!'...

అక్క అనారోగ్యంగా వుంది. జ్వరం...తలనొప్పి, కడుపునొప్పి, నీరసం రెండు రోజులనుండి వుంటున్నాయ్. ఈ రోజు విజృంభించినాయి. అమ్మ జనరల్ హాస్పిటల్‌కు తీసుకెళ్ళి చూపింది. వారు అడ్మిట్ చేసుకొన్నారు. మీకు ఉత్తరం వ్రాసే శక్తి గూడలేదు. మీరే అక్కకు ఉత్తరం వ్రాయండి.

ఇట్లు
రామలక్ష్మి.

ఉత్తరం అప్రయత్నంగా నానుండి జారిపోయింది. నా గుండెల్లో యెవరో సమ్మెటలతో మోదుతున్నంత బాధగా వుంది.

రాత్రి నేను పొందిన అనుభూతి కలకాదు.

నిజమే...నిజమే...

నా లలితను నేను కలుసుకోవాలి...

నా లలితను నేను దక్కించుకోవాలి...

వెంటనే బళ్ళారికెళ్ళాలని నిశ్చయించుకొన్నాను. నా నిశ్చయాన్ని మిత్రునికి తెలుపుతూ ఉన్న సంగతి చెప్పాను.

ఆయన అన్నాడు. 'ఉత్తరం వ్రాసి ఇపుడెట్లుందో తెలుసుకొని ఆ తరువాత వెళుదువు గాని' అని.

నేనేం పలుకలేదు.

నా దృఢనిశ్చయాన్ని తెలుసుకొన్న నా మిత్రుడు నీ యిష్టమన్నాడు.

నిముషాల్లో డ్రస్సు చేసుకొని స్టేషను చేరుకొన్నాను. నేను పోయిన కొద్ది నిముషాల్లోనే రైలువచ్చి స్టేషనులో ఆగింది. ఆ కొద్ది నిముషాలే నా కెంతో ఆలస్యమనిపించింది.

మరుసటిరోజు ఉదయం ఆరు గంటలకు బళ్లారి చేరుకొన్నాను. ఇంటికి ఎంతో దగ్గరయినా నడచి వెళితే ఆలస్యమవుతుందని రిక్షాలో ఇల్లు చేరుకొన్నాను.

మరదళ్ళు నిదుర మొహంతో స్వాగతం పలికారు. ఆ స్వాగతాలను నవ్వుతూ తీసుకొనే వోపిక నాలో లేదు.

'అత్తమ్మ' యెక్కడుందన్నాను.

హాస్పిటల్లో వుందన్నారు.

లలిత కెలావుందన్నాను.

కొంచెం బాగానే వుందన్నారు.

ఆ 'బాగు' అనే పదం తుపానులో కొట్టుకెళ్ళుతున్న జీవితాధారంగ బలమైన వృక్షపు మొదలు దొరకినట్లయింది. ఒకరిని తోడు తీసుకొని హాస్పిటల్‌కు వేగంగా పోయాను. లలిత వుండే వార్డు చేరుకొన్నాను.

నిండుగా దుప్పటి కప్పుకొని, నిదురిస్తూ కనుపించింది నా లలిత. ప్రక్కన బెడ్‌లో వున్న ఒకామె లలితను మేల్కొలిపింది. బాధగా మూల్గుతూ దుప్పటి తొలగించి ఆమె వైపు చూచింది.

ఆమె ముఖంలో ముందులా వెలుగులేదు.

ఆమె కళ్ళల్లో ముందులా కాంతిలేదు.

పెదవులు వాడిపోయి వున్నాయి.

బుగ్గలు నీరసించి వున్నాయి.

ఆమెనా పరిస్థితిలో జూస్తుంటే నా కళ్ళ నిండుగా నీరు క్రమ్ముకొన్నాయి. దుఃఖంతో పలుకరించేందుకు పెదవి కదలలేకపోయింది. మౌనంగ ఆమెవైపుచూస్తూ వూరకుండి పోయాను.

'ఎవరో వచ్చారు నీకోసం' అంది ప్రక్కనామె.

బరువుగా నా వైపు తల త్రిప్పింది...—అంతే—.

ఆమె ముఖంలో కళ్ళల్లో నశించి పోయిన వెలుగు... కాంతి స్విచ్ వేసిన వెంటనే ఎలక్ట్రిక్ బల్బులా వెలిగిపోయాయి. ఆమె బుగ్గలు వికసించినాయి...నీరసించిన ఆమె పెదాలు ఆశ్చర్యంగ కదలినాయి...

'బావా...' అంది మెత్తగా...

'లలితా...' అన్నాను గాద్గదికంగా.

ఆమె కళ్లలో నీరు తిరుగాయి. 'వచ్చారా...బావా' అంది.

నా లలితను దక్కించుకొనేందుకొచ్చాను లలితా..' అన్నాను, ఆమె ప్రక్కన కూర్చుంటూ. ఆ మాట లంటూంటే నా కళ్లల్లో నీరు తిరిగాయి.

'బావా! ఏమిటిది! వద్దుబావా' నా కన్నీళ్లు తుడిచింది. 'ఇక నాకేం భయంలేదు. నా బావ వచ్చారుగా. ఇక నా ఆరోగ్యం తొందరగా సరిపడుతుంది.' అంది నా చేతులను తన రెండు చేతుల్లోకి తీసుకొంటూ.

అంతే! దీపం ఆరిపోయింది.